



పుట్టిన ప్రతి మనిషి గిట్టక తప్పదు. అది నగ్న సత్యం! కానీ తను ఈవాళో రేపో చనిపోతున్నాడని తెలుసు కున్నాక ఆ మనిషి అనుభవించే నరకం ఎవరూ వర్ణించి చెప్పలేరు.

సీతమ్మకు బ్లడ్ కేన్సర్! ఈవాళో రేపో అని చెప్పేశారు డాక్టర్లు. ఆమె ఇద్దరు కూతుళ్ళు, అల్లుళ్ళు పిల్లలతో సహా వచ్చేశారు- ఆఖరి చూపు కోసం. ఆమెకు ఒక్కడే కొడుకు: అహర్నిశలూ తల్లిని కనిపెట్టుకుని వుంటున్నాడు- ఖిన్న వదనంతో.

ఇక ఆమె భర్త గోవిందయ్య, భార్య అనుభవించే నరకం చూడ లేక పోతున్నాడు. అతని మనసు క్షోభించి పోతోంది-భార్య దూరమై పోతున్నందుకు.

ఆమె ఎటూ పోతుందని తెలి సినా మానవ ప్రయత్నం కొన సాగిస్తూనే వున్నారు డాక్టర్లు.

సీతమ్మను మాత్రం అసం తృప్తి పీడిస్తోంది.ఆమెకు ఏ లోటూ లేదు. అంతులేని సిరి సంపద లున్నాయి. రత్నాల్లాంటి బిడ్డ లున్నారు. అపురూపంగా చూసు కునే భర్త వున్నాడు. ఎన్ని వున్నా ఆమె అసంతృప్తితో బాధ పడ డానికి కారణం వుంది. ఆమె కోరుకున్న కోరిక తీరకుండానే పోతోంది.

ఆమె బెడ్ ప్రక్కనే నిలబెట్టిన స్టాండ్‌కి ఎర్రగా వ్రేలాడుతోంది నెత్తురు సీసా! అందులో నుంచి ఒక్కొక్క బొట్టే ఆమె దేహంలో కలిసి పోతోంది.

సీతమ్మ మూలుగుతోంది..

"ఏవండీ!"

"ఆఁ .. ఏమిటి సీతా?" నెమ్మ దిగా అన్నాడు గోవిందయ్య.

"నేను బ్రతికుండగా నా కోరిక తీరలేదు."

గోవిందయ్య తప్పు చేసిన వాడిలా తల వంచు కున్నాడు.

సీతమ్మ ఆవేదనతో అంది. "నేను పోయాకైనా నా కోరిక తీరుస్తారు గదూ!"

"అలాగే. తప్పకుండా తీరు స్తాను సీతా! నీ కోరిక నేను ఏది కాదన్నాను చెప్పు!" బాధగా అన్నాడు గోవిందయ్య.

ఆ మాట ఎవరూ కాదన లేరు. తన భార్య కోర్కె లెన్నో తీర్చాడు గోవిందయ్య!

సీతమ్మ కోర్కెలేవీ తీరకుండా పోలేదు. అసలు వారి దాంపత్య జీవితమే కోరికలతో మొదలైంది.

మొదటి రాత్రి ఆమె భర్తని ఒక కోరిక కోరింది.

"మీరు పంచె కట్టుకుంటే నాకు బాగోలేదు. చక్కగా ప్యాం టులు వేసుకోండి!" అని.

గోవిందయ్య నివ్వెరపోయాడు.

"ప్యాంటులు కట్టుకోనా? పొలం వెళ్ళి ఎలా పని చెయ్యాలి?

పొలం వెళ్ళక పోతే మానాన్న తంతాడు" అన్నాడు గోవిందయ్య.

"పొలం వెళ్ళేటప్పుడు పంచెలే కట్టుకోండి!" అని వుభయ తారకంగా చెప్పింది సీతమ్మ.

ఆమె కోరిక తక్షణం తీర్చాడు గోవిందయ్య. ముసలాయన గొణిగాడు. ముసలమ్మ సణిగింది. అన్నదమ్ములు జంతువుని చూసినట్లు చూశారు. వూళ్ళో వాళ్ళకి వింతగా వుంది గోవిందయ్య వాలకం!

కొన్నాళ్ళకు ముసలాయన పోయాడు.

సీతమ్మ కోరికలు పురి విప్పిన నెమళ్ళలా నాట్యం చేశాయి.

సీతమ్మ పెదనాన్నగారి అల్లుడు పంచాయితీలో మెంబరయ్యాడు. ఆ సంగతి ఆయన గొప్పగా చెప్పుంటే సీతమ్మకి మండి పోయింది.

తర్వాత పంచాయితీకి ఎలక్షన్లు వచ్చినప్పుడు చెవిలో జోరీగలా పోరి గోవిందయ్యను పంచాయితీకి నిలబెట్టింది. తనకు రాజకీయాలలో ఆసక్తి లేక పోయినా భార్య కోరిక కాదన లేక దిగాడు గోవిందయ్య. ఇక గోదాలోకి దిగాడు గనుక, బంధు మిత్రులు పూనుకోక తప్ప లేదు. అన్నదమ్ములు మాత్రం ఆస్తి పంపకాలు జరగాలని పట్టు బట్టారు! నిజమే 'వున్నదంతా ఎలక్షన్ ఖర్చులకని పెడితే కొంప దివాళా తియ్యడమే గదా'! అని పెద్ద వాళ్ళు ఆస్తి పంచారు.

గోవిందయ్య వేరు కాపురం పెట్టాడు. పంచాయితీ మెంబరయ్యాడు. ఎటూ దిగాడు గనుక ప్రెసిడెంటు పదవికి గాలం వేశాడు. డబ్బుతో మెంబర్లని తిప్పుకున్నాడని అపోజిషన్ వాళ్ళు అభాండాలు వేశారు. ఎవరేం అనుకుంటేనేం- గోవిందయ్య ప్రెసిడెంట్ పదవి అధిష్టించాడు.

బంధువు ఇంట్లో పెళ్ళికని తెనాలి వెళ్ళింది సీతమ్మ. అక్కడొక సినిమా హాలు యజమాని భార్యను అంతా గొప్పగా ఆదరించడం గమనించింది. సినిమా హాల్లో లాభాలు బాగా వుంటాయని తెలుసుకుంది. సీతమ్మ మనసులో కోరిక పుట్టింది-తమ వూళ్ళో హాలు కట్టాలని.

భార్య కోరిక విని బెదిరి పోయాడు గోవిందయ్య. అతనికి వ్యాపారం అంటేనే తెలియదు. ఇక సినిమా వ్యాపారం అంటే ఎంత గందర గోళమో! 'అందులో తనకి అ....ఆ లు రావు. అదీగాక పెట్టుబడి కావాలి. ఎందు కొచ్చిన గొడవ?' అని భార్య కోరికని చంప

దానికి ప్రయత్నించాడు. ఆమె కోరిక రెండు తలల శిఖండి! దానికి చావు లేదు. గోవిందయ్య ప్రయత్నం విఫలమైంది. ఆమె కోరిక చిన్న మొక్కలా పుట్టి రోజు రోజుకూ పెరుగుతూ మహా వృక్షమైంది.

"ప్రతి దాంట్లోనూ ఎవరికి మాత్రం అనుభవం వుంటుంది? దిగితే అదే వస్తుంది" అని భర్తను నెట్టసాగింది సీతమ్మ.

"అనుభవం సరే - డబ్బు?"

"ఎంత కావాలట?"

"టూరింగ్ సినిమా హాలైనా పాతిక వేలు కావాలి."

"అంతే గదా! నాలుగెకరాలు అమ్మేస్తేసరి. అందులో ఏం లాభం వస్తున్నది? ఎంత కాలం వున్నా గొర్రెతోక బెత్తెడే!" అంది సీతమ్మ.

పొలం అమ్మితే వూళ్ళో వాళ్ళ దృష్టిలో విలువ పోతుందనీ, స్థిరాస్తి అమ్ముకున్నాడని బంధువుల్లో చెడ్డ పేరు వస్తుందనీ భార్యకు చెప్పి చూశాడు. అత్తమావలతోను, బామ్మర్దులతోనూ చెప్పించాడు.

సీతమ్మ తన పట్టు విడువలేదు! గోవిందయ్యకు తప్పలేదు- పొలం అమ్మడం!

ఆర్నెల్లు తిరిగే సరికి టూరింగ్ సినిమా వూరి చివర పంచాయితీ

---


విజయ

# చందా వివరాలు

| | |
|---|---|
| సంవత్సర చందా | 42 రూ॥ |
| అర్ధసంవత్సర చందా | 21 రూ॥ |
| విడి ప్రతి | 3-50 రూ॥ |

బంజరులో వెలసింది. ఆ హాలు పేరేమిటో చెప్పనక్కర లేదు. సీత పేరే!

సీతమ్మ అదృష్టమో, గోవిందయ్య చాక చక్యమో గాని సినిమా వ్యాపారంలో బాగా గడించారు. రెండేళ్ళు దాటే సరికి పుష్పక విమానం లాంటి పర్మినెంట్ హాలు కట్టించారు. ఆ వూరు పది వూళ్ళకి కూడలి. ఇక సినిమా చూడ్డానికి చుట్టు ప్రక్కల వూళ్ళ జనం అల వాటు పడ్డారు. వూళ్ళో వ్యాపారం పెరిగింది. గుడ్డల కొట్లు, చెప్పుల షాపులు వెలిశాయి. ఒక డాక్టర్ నర్సింగ్ హోమ్ పెట్టాడు. మరొక లేడీ డాక్టరు పురుళ్ళ ఆస్పత్రి పెట్టింది. వాటి ప్రక్కనే మందుల కొట్లు లేచాయి.

పదేళ్ళలో వూరి స్వరూపమే మారిపోయింది. గోవిందయ్యపలుకు బడి అంచె లంచెలుగా పెరిగింది. జిల్లా లెవల్లో పెద్దమనిషి అయ్యాడు. వూళ్ళో రెండతస్థుల మేడ కట్టించాడు. అయితే మరొకళ్ళు ఆ వూళ్ళో సినిమా హాలు కట్టకుండా జాగ్రత్త పడ్డాడు. లైసెన్సులు దొరక్కుండా చేశాడు.

తన పలుకుబడితోపాటు ఆర్థిక వనరులు కూడా పెంచుకుంటూ పోయాడు గోవిందయ్య. ఏభై ఎకరాలు కారు చౌకగా మెట్ట భూమి కొన్నాడు. బోరింగులు పెట్టించి నిమ్మ, బత్తాయి తోటలు వేయించాడు. సముద్రపు ఒడ్డున సరివి తోటలు పెంచాడు.

భార్యమీద ఎంతో విశ్వాసం గోవిందయ్యకు! సీతమ్మ మాట వేదం! ఆమె కోరిక కాదనే ప్రసక్తే లేదు.

ఇద్దరు కూతుళ్ళకు భార్య కోరిక ప్రకారమే ఒకళ్ళను ఇంజనీర్‌కి, మరొకళ్ళను డాక్టర్‌కి ఇచ్చి పెళ్ళి చేశాడు. డాక్టర్‌తో పట్నంలో నర్సింగ్ హోమ్ పెట్టించాడు. ఇంజనీర్‌తో కాంట్రాక్టులు మొదలెట్టించాడు.

అతి గారాబం వలన కొడుక్కి చదువు అబ్బలేదు. దురభ్యాసాలు అలవడ్డాయి. కొడుకు సంగతి బయటకి పొక్కక మునుపే, గుట్టు రట్టు కాకుండా వుండగానే ఆస్తిలో ఆస్తి కలిసే ఏకైక కుమార్తె వున్న సంబంధం చూపి పెళ్ళి చేసింది సీతమ్మ.

కొంత కాలానికి పల్లెటూరి నివాసం ఆమెకు బోర్ కొట్టి దుర్భరమైంది. ఆమె ఆ చికాకులో ఉండగా అసెంబ్లీకి ఎలక్షన్లు వచ్చాయి. గోవిందయ్యను నడుం కట్టమని పురమాయించింది.

(మిగతా కథ 79వ పేజీలో)

(నా కోరిక తీర్చరూ? ........ 16వ పేజీ తరువాయి)

గోవిందయ్య తిప్పలుపడి అధికార పార్టీ టిక్కెట్టు సంపాదించాడు. ఎమ్.ఎల్.ఏ. అయ్యాడు. నగరంలో క్వార్టర్ ఇచ్చారు. అసెంబ్లీ సమావేశాలప్పుడు భార్యతో సహా మకాం పెట్టేవాడు.

సీతమ్మకి తృప్తి లేకపోయింది. అక్కడో కాలు, ఇక్కడో కాలు కొంతకాలం నగరం, మరికొంత పల్లెటూరి నివాసం-ఆమెకు విసుగనిపించింది. ఏ.సి. థియేటర్లలో సినిమాలు, ఖరీదైన హోటళ్ళలో వసతులు ఎప్పటికీ అనుభవించాలని ఆమె ఆలోచించింది. నగరంలోనే సెంటర్ చూసి ఏ.సి. థియేటర్, షాపింగ్ కాంప్లెక్సు అధునాతనమైన హోటలు కట్టించాలని ఆమె కోరిక.

ఆమె కోరిక విని కంగారు పడ్డాడు గోవిందయ్య. కనీసం అది కోటిరూపాయల ప్లాను.

అయినా తప్పదు గదా!

అందుకే తిప్పలు పడ్డాడు. అందిన చోటల్లా అప్పులు చేశాడు. కొన్నేళ్ళకి సీత 70 ఎమ్. ఎమ్. థియేటర్, షాపింగ్ కాంప్లెక్సు, గోవింద్ ఇంటర్నేషనల్ హోటల్ వెలిశాయి నగరంలో.

సీతమ్మ కోరికలకు ఫుల్‌స్టాప్ పడిందా అంటే, వుహూం-లేదు. ప్రతి పనికీ అడ్డంకులు. అధికారులు నెలల తరబడి త్రిప్పడం, చివరకు ఏ మంత్రిగారినో పట్టుకోవడం సీతమ్మకు చిన్నతనం అనిపించింది.

"క్యాబినెట్‌లో మినిష్టర్ పదవి సంపాదించండి!" అని భర్తని కోరింది.

ఇప్పుడిక ఎదురు చెప్పడం మానుకున్నాడు గోవిందయ్య. "సరే!" అన్నాడు. మంత్రి అయ్యాడు. మంత్రి వర్గంలో క్యాబినెట్‌లో సమర్థుడైన మంత్రి అని ప్రజలచే జేజేలు పలికించుకున్నాడు. అవలీలగా గంటల తరబడి వుపన్యాసం దంచడం అలవాటైంది. మెషీన్ గన్‌లా వాగ్దానాలు వదలడంలో సాటిలేని మేటి అయ్యాడు.

గోవిందయ్య ఫోటోలేని పేపరు అరుదు. ఆయనపేరు రోజూ రేడియోలో వినిపిస్తూ వుంటుంది. అందుకు కారణం వుంది. ఎవరు ఏది ప్రారంభోత్సవం చెయ్యమన్నా కాదనకుండా బయల్దేరేవాడు. అది బ్యూటీ పార్లర్ కావచ్చు, ఫోటో స్టూడియోగానీ, బురద కాలువ మీద వంతెన కానీ చిన్నా, పెద్దా అని ఆలోచించేవాడు కాదు. ప్రజలకు అందుబాటులో వున్న నాయకుడు అని పేరు తెచ్చుకున్నాడు. అజాత

శత్రువని ప్రతిపక్షాలవాళ్ళు స్తుతించారు.

గోవిందయ్యకు మాత్రం లోలోపల భయంగానే వుంది- 'మీరు ముఖ్యమంత్రి అయితే చూడాలని వుందండీ' అని భార్య ఎక్కడ కోరుతుందో అని.

ఈ లోపల సీతమ్మ ఆరోగ్యం దెబ్బతింది. బ్లడ్ క్యాన్సర్ అని తేలింది. ఆమె జీవితం మహా అయితే రెండు నెలలు.

'చనిపోతున్నామని తెలిశాక ఏ మనిషి మాత్రం కోర్కెలు కోరగలదా? తృప్తిగా కళ్ళు మూస్తుంది గదా!' అనుకున్నాడు గోవిందయ్య.

కాని అతని అంచనా తారుమారైంది.

సీతమ్మ తన అంతిమ కోర్కె వినిపించింది.

గోవిందయ్యకు కొన్ని క్షణాలు నోట మాటలు రాలేదు. విభ్రాంతితో స్తంభించి పోయాడు.

* * *

బెడ్ మీద సీతమ్మ బాధతో మూలుగుతోంది.

"ఏమండీ!....."

"మవ్వు మాట్లాడకు సీతా! ఆయాసం వస్తుంది." ఆప్యాయంగా అన్నాడు గోవిందయ్య.

"నా కోరిక తీరుస్తారు గదూ!!" రొప్పుతూ అంటోంది ఆమె.

"అలాగే సీతా!"

"అబ్బాయిని మీకన్నా గొప్పవాడివి చెయ్యాలి"

"అలాగే..." బొంగురుపోయిన కంఠంతో అన్నాడు.

సీతమ్మ తృప్తిగా చూస్తోంది భర్తవంక. ఆమెకు విశ్వాసం వుంది ఆయన మాటమీద! అనుకున్నది సాధించి తీరతాడు.

'కాని...కాని...తను మాత్రం ఆ కోరిక తీరకుండానే పోతోంది!'

సీతమ్మ మూలుగు తోంది:

అర్ధరాత్రికి ఆమె మూలుగు హీనమై పోయి, క్రమంగా ఆగిపోయింది. కళ్ళు మూతలు పడ్డాయి.

సీతమ్మ జీవితాన్ని చాలించింది- తన కోరిక తీరకుండానే! ఇంతకీ తీరని కోరిక ఏమిటి?

"ఏమండీ! మన బాబుని మీకన్నా గొప్పవాడిని చెయ్యాలి. వాడు ముఖ్య మంత్రి కావాలని నా కోరిక!!" ●

---

**Edited & Published by VIJAYA BAPINEEDU**
**80, Dhanalaxmi Colony. Madras-600 026, and**
**Printed by him at Vijaya Graphics;**
**210-Arcot Road, Madras-600 026. Phone: 422233**